సాక్షి ఖమ్మం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



ఇకపై నిరంతరం కొనుగోళ్లు

మధిర వ్యవసాయ మార్కెట్‌ను అప్‌గ్రేడ్ చేసి నిరంతరం పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేలా సన్నాహాలు జరుగుతున్నాయి. 8లో



నూతనోత్సాహంతో విధులు..

బదిలీ అయిన సెర్ప్ ఉద్యోగులు కొత్త స్థానాల్లో ఉత్సాహంగా పనిచేస్తూ లక్ష్యాలు సాధించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం ఎండ పెరిగినా సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించాక, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. ఆతర్వాత పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక దర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ రాజశేఖర్

మధిర: నమ్మకంతో వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) డాక్టర్ రాజశేఖర్ సూచించారు. మధిర ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి హాజరు, చికిత్స వివరాలతో పాటు మందులను పరిశీలించి సూచనలు చేశారు. ఆస్పత్రి ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే కాక ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎప్పటికప్పుడు అవసరమైన మందులు సమకూర్చుకోవాలని డీసీహెచ్ఎస్ సూచించారు.

కొత్త కార్డుదారులకూ బియ్యం



బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎం శ్రీలత

నేలకొండపల్లి: కొద్దినెలలుగా జిల్లాలో కొత్తగా రేషన్‌కార్డులు మంజూరైన వారికి సెప్టెంబర్ 1నుంచి బియ్యం పంపిణీ చేస్తామని సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ జీ.శ్రీలత తెలిపారు. నేలకొండపల్లిలోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించిన ఆమె రేషన్ షాప్‌లకు బియ్యం సరఫరాపై సూచనలు చేశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ 748 రేషన్ దుకాణాలకు 5,783 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించగా, ఇప్పటికే 3,152 మెట్రిక్ టన్నుల బియ్యం దుకాణాలకు చేరిందని తెలిపారు. రేషన్ డీలర్లు కమీషన్ చెల్లించాలని చేపట్టిన ఆందోళన వచ్చేనెల 5వ తేదీ నాటికి పరిష్కారం కావొచ్చని వెల్లడించారు. ఏదిఏమైనా బియ్యం పంపిణీకి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆమె స్పష్టం చేశారు.

బదిలీలపై కోర్టుకు పీఏసీఎస్‌ల కార్యదర్శులు

ఖమ్మంవ్యవసాయం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల్లో పనిచేస్తున్న కార్యదర్శులను ఇటీవల బదిలీ చేయగా పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఖమ్మం డీసీసీబీ పరిధిలో మొత్తం 69 మంది కార్యదర్శులను బదిలీ చేశారు. ఇందులో 35 మంది అభ్యంతరం తెలుపుతూ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రస్తుతం పొందుతున్న వేతనంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయటం ఇబ్బందికరమని పేర్కొనడంతో పాటు ఇతర కారణాలను చూపుతూ శుక్రవారం పిటీషన్ దాఖలు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని రంగారెడ్డి, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మెదక్ తదితర జిల్లాల్లో పీఏసీఎస్‌ల కార్యదర్శులు సైతం హైకోర్టును ఆశ్రయించి బదిలీలపై స్టే తెచ్చుకున్నారు. ఇదేమార్గంలో ఖమ్మం డీసీసీబీ పరిధి కార్యదర్శులు కూడా కోర్టుకు వెళ్లారు. కార్యదర్శులను బదిలీ చేసి నాలుగు రోజులు గడిచినా కొత్త స్థానాల్లో చేరకపోగా, కోర్టును ఆశ్రయించడంతో ఉన్నతాధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో తేలాల్సి ఉంది.

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలు కానుంది. హైదరాబాద్‌లో శనివారం సమావేశమైన రాష్ట్ర కేబినెట్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. దీంతో ఎన్నికలు త్వరలోనే జరుగుతాయన్న సంకేతాలు వెలువడినట్లయింది. కొద్దినెలలుగా ఎన్నికల నిర్వహణపై ప్రచారం జరుగుతున్నా వాయిదా పడుతూ వస్తోంది. అయినా అధికారులు మాత్రం ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తాజాగా గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల చేశారు. అయితే, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికలే ముందు నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల కోర్టు తీర్పు నేపథ్యాన సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో ఈసీ కూడా దృష్టి సారించనుంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

స్థానిక పోరుకు వేళాయె

జిల్లాలోని జీపీల్లో ఓటర్లు (ముసాయిదా జాబితా)

పురుషులు	3,88,244
మహిళలు	4,14,424
ఇతరులు	22
మొత్తం	8,02,690



వచ్చే నెలలో ఎన్నికల సందడి ?!

- ఇప్పటికే జీపీల ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఉంటాయని ప్రచారం
- ఎన్నికల సంఘం నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

ఏడాదిగా 'ప్రత్యేకమే'

గ్రామపంచాయతీ ఎన్నికలు 2019లో జరగగా, గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన పాలకవర్గాల గడువు ముగిసింది. ఇక జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అదే ఏడాది మే నెలలో నిర్వహిస్తే 2024 జూన్‌తో పాలకవర్గాల గడువు తీరింది. అప్పటి నుంచి గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. కానీ ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో పాలన కుంటుపడడం, నిధుల కూడా అంతంత మాత్రంగానే వస్తుండడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

అదిగో.. ఇదిగో అంటూ..

ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు త్వరలోనే జరుగుతాయంటూ హడావుడి చేయడం.. ఆపై మరుగున పడడం సాధారణమైంది. గత ఐదారు నెలలుగా నేడో, రేపో నోటిఫికేషన్ వస్తుందని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా సంకేతాలిచ్చారు. మాజీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నియోజకవర్గాల వారీగా సమావేశాలు సైతం పూర్తిచేశారు. అయితే కులగణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది తేలక ఆశావహులు కూడా స్తబ్దుగా ఉండిపోయారు.

కోర్టు తీర్పుతో మళ్లీ..

ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. సెప్టెంబర్ 30కల్లా స్థానిక సంస్థల్లో పాలకవర్గాలు కొలువుదీరాలని తీర్పు వెలువడింది. జిల్లాలోని 571 గ్రామపంచాయతీల్లో 5,214 వార్డులు, అంతే సంఖ్యలో పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతం 3,146 బ్యాలెట్ బాక్స్‌లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పోలింగ్ రెండు విడతల్లో నిర్వహించే అవకాశం ఉండడంతో 2,607 బాక్స్‌లు సరిపోతాయి. మిగతావి రిజర్వ్‌గా భద్రపరుస్తారు. ఇక జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 1,572 పోలింగ్ కేంద్రాలను గుర్తించి, 3,150 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. అలాగే, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో 10,330 మంది అవసరమని ఇప్పటికే తేల్చారు.

ఎన్నికల సంఘం వైపు చూపు..

స్థానిక సంస్థలకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. హైదరాబాద్‌లో శనివారం సమావేశమైన కేబినెట్ స్థానిక ఎన్నికలకు ఆమోదం తెలుపుతూ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈనెల 28న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయగా.. జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీఓల ఆధ్వర్యాన పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. వార్డుల విభజనపైనా అభ్యంతరాలు స్వీకరించారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం అనంతరం వచ్చేనెల 2న ఓటర్ల తుదిజాబితా విడుదల కానుంది. ఎన్నికల సంఘం ప్రస్తుతం జీపీల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేయడంతో తొలుత పంచాయతీ ఎన్నికలే జరుగుతాయని భావించారు. కానీ మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆతర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని తెలుస్తోంది. మంత్రి మండలి లేఖ ఆధారంగా ఎన్నికల సంఘం ఏ ఎన్నికలకు, ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తుందోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

పీఏసీఎస్‌ల ద్వారానే యూరియా పంపిణీ

- పైలట్ ప్రాజెక్టుగా పాలేరు నియోజకవర్గం
- అధికారులతో సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పక్కన అధికారులు

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: రైతులకు యూరియా పంపిణీ సాఫీగా జరిగేలా పాలేరు నియోజకవర్గంలో పీఏసీఎస్‌ల ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకోగా.. అమలుపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి శనివారం పాలేరు నియోజకవర్గంలోని పీఏసీఎస్‌ల కార్యదర్శులు, వ్యవసాయాధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో సహకార సంఘాల ద్వారా 55 కేంద్రాల్లో మంగళవారం నుంచి యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తద్వారా ప్రైవేట్ డీలర్లకు కేటాయింపులు ఉండవని చెప్పారు. నియోజకవర్గంలోని 21 పీఏసీఎస్‌లతో పాటు 36 ఉపకేంద్రాల ద్వారా పంపిణీని పర్యవేక్షించేందుకు వివిధ శాఖల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అన్వర్, ఏడీఏ సతీష్, ఏఓ పవన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్ల ఏర్పాటు, సిబ్బంది నియామకం

యూరియా పంపిణీకి నియోజకవర్గంలోని 21పీఏసీఎస్‌లతో పాటు అదనంగా 36 సబ్ సెంటర్లను ఏర్పాటు చేస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాక సెంటర్లకు ప్రత్యేక సిబ్బందిని, పర్యవేక్షణకు మండల స్థాయి అధికారులను నియమించారు. తిరుమలాయపాలెం మండలంలో ఎర్రగడ్డ, తెట్టెలపాడు, పాతర్లపాడు, హైదర్‌సాయిపేట, బచ్చోడు, తాళ్లచెరువు, పైనంపల్లి, కాకరవాయి, సుబ్లేడు, మహ్మదాపురంలో సబ్ సెంటర్లు ఏర్పాటుచేయగా ఖమ్మంరూరల్ మండలంలో వెంకటగిరి, మద్దులపల్లి, పొన్నెకల్లు, ముత్తగూడెం, ఆరెంపుల, ఎం.వెంకటాయ పాలెం, తీర్థాలలో ఏర్పాటు చేశారు. అలాగే, కూసుమంచి మండలంలో చేగొమ్మ, జీళ్లచెరువు, పోచారం, జక్కేపల్లి, జుజుల్‌రావుపేట, గట్టుసింగారం, ఈశ్వరమాధారం, పాలేరు, నాయకన్‌గూడెం, చౌటపల్లి, గైగోళ్లపల్లి, కొత్తూరు, కూసుమంచి-1, కూసుమంచి-2, లోక్యాతండా, నేలపట్ల, నేలకొండపల్లి మండలంలో గువ్వలగూడెం, నేలకొండపల్లి, బుద్దారం సబ్ సెంటర్లను యూరియా పంపిణీ కోసం ఏర్పాటు చేశారు.

నేడు 2,638 మెట్రిక్ టన్నుల యూరియా

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు ఆదివారం 2,638 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇందులో 938 మెట్రిక్ టన్నులను ఖమ్మం జిల్లాకు, 1,100 మెట్రిక్ టన్నులు భద్రాద్రి కొత్తగూడెం, 500 మెట్రిక్ టన్నులు మహబూబాబాద్ జిల్లాకు కేటాయిస్తుండగా, మిగతా మరో 100 మెట్రిక్ టన్నుల యూరియాను బఫర్ స్టాక్‌గా నిల్వ చేస్తామని వెల్లడించారు. కాగా, శనివారం నాటికి ఖమ్మం జిల్లాలో 491 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు.

వర్షాలతో పంటలకు నష్టం

3,644 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల వరుస వర్షాలతో జిల్లాలో 3,644 ఎకరాల మేర పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఇందులో 33 శాతానికి పైగా 2,893 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ప్రభుత్వం పరిహారం ప్రకటిస్తే 33 శాతానికి పైగా నష్టం జరిగిన పంటలనే పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. కాగా, వరి 1,950 ఎకరాలు, పత్తి 330 ఎకరాలు, పెసర 613 ఎకరాల్లో నష్టపోయినట్లు గుర్తించారు. కూసుమంచి మండలంలో అత్యధికంగా వరి 1,875 ఎకరాల్లో, పత్తి 320 ఎకరాల్లో, పెసర 160 ఎకరాల పంటను రైతులు నష్టపోయారు. తల్లాడ మండలంలో పెసర 350 ఎకరాల్లో, ఎర్రుపాలెం మండలంలో వరి 50 ఎకరాల్లో, ఖమ్మం అర్బన్ మండలంలో పెసర 53 ఎకరాల్లో, రఘునాథపాలెం మండలంలో పెసర 50 ఎకరాల్లో, ఏన్కూరు మండలంలో పెసర 50 ఎకరాల్లో, ఖమ్మం రూరల్ మండలంలో వరి 25 ఎకరాల్లో, పత్తి 10 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు.

ఇక పరుగెత్తడమే...



ట్రాక్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన మెటల్ పనులు

- రెండు నెలల్లో అందుబాటులోకి సింథటిక్ ట్రాక్
- నవంబర్ నాటికి పూర్తి చేసేలా పర్యవేక్షణ



డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: అథ్లెటిక్స్ క్రీడాకారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న సింథటిక్ ట్రాక్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ట్రాక్ నిర్మాణ పనులు నాలుగు నెలల నుంచి ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే చుట్టూ తారు రోడ్డు వేసే పనులు జరుగుతున్నాయి. ఆ వెంటనే సింథటిక్ ట్రాక్ నిర్మాణం చేపడతారు. అంతేకాక భారీ వర్షం పడినా ట్రాక్‌పై నీరు నిల్వకుండా చుట్టూ డ్రెయినేజీ నిర్మాణం చివరి దశకు చేరింది. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయితే పరుగు పందెంతో పాటు లాంగ్ జంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ క్రీడాకారులకు వరంలా మారనుందని చెబుతున్నారు.

రూ.8కోట్ల వ్యయంతో..

సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.8.50 కోట్లు కేటాయించింది. ఈ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సింథటిక్ ట్రాక్‌ను మొత్తం 400 మీటర్ల పరుగుకు సరిపోయేలా ఏర్పాటు చేస్తుండగా ఎనిమిది లైన్లను వేస్తారు. ఇక 110 మీటర్ల పరుగుకు సైతం అందులోనే ట్రాక్ నిర్మిస్తున్నారు. తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.43 కోట్లు వెచ్చించగా, సింథటిక్ ట్రాక్ నిర్మాణం, ఇతర పనులకు రూ.52.24 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇక సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.26 లక్షలు, లాంగ్‌జంప్ ఫిట్‌కు రూ.15లక్షలు, చాంబర్లకు రూ.12 లక్షలు, ట్రాక్ ఫ్లాట్‌ఫాం కోసం రూ.8.49 లక్షలు కేటాయించారు.

అద్భుతమైన ఫలితాలకు ప్రతిఫలం



జిల్లా అథ్లెట్లు సాధిస్తున్న అద్భుతమైన ఫలితాలను పరిగణనలోకి తీసుకుని సింథటిక్ ట్రాక్ మంజూరు చేశారు. అయితే, తొలినాళ్లలో అపోహలు ఉన్నా రాష్ట్ర క్రీడా శాఖ అధికారుల చొరవతో సాధ్యమైంది. ట్రాక్ అందుబాటులోకి వస్తే జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఖాయం. సింథటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తికాగానే ఖమ్మం కేంద్రంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించాలనే ఆలోచన ఉంది.

– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్ఓ

సీఎంతో తాడోపేడో తేల్చుకుంటాం..

- 9వ తేదీన మహాగర్జన సభ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



బోనకల్ : సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ, పక్కన నాయకులు

నేలకొండపల్లి/బోనకల్/కల్లూరు: పెన్షన్ల పెంపుపై హామీ అమలును ప్రభుత్వం విస్మరించిన నేపథ్యాన సెప్టెంబర్ 9న జరిగే సభ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. నేలకొండపల్లి, బోనకల్, కల్లూరులో శనివారం జరిగిన పాలేరు, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబర్ 9వ తేదీలోగా దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు, ఇతరుల పింఛన్‌ను రూ.4 వేలు పెంచుతున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లక్షలాది మంది పెన్షన్‌దారులతో హైదరాబాద్‌లో 9వ తేదీన మహాగర్జన సభ నిర్వహిస్తామని తెలిపారు. అధికారం వచ్చి నెలలు గడుస్తున్నా పెన్షన్ పెంపుపై సీఎం మాట్లాడకపోవడం మోసం చేయడమేనని చెప్పారు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సైతం మౌనంగా ఉండడం సరికాదని తెలిపారు. అంతేకాక ఆయన గడీ దాటి అసెంబ్లీకి సైతం రావడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యాన పింఛన్‌దారులకు తాము అండగా నిలిచి పెంపు కోసం పోరాడుతామని మంద కృష్ణ స్పష్టం చేశారు. కాగా, గుండె జబ్బుతో బాధపడుతున్న పిల్లల వైద్యం కోసం దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. కానీ రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌కు పేదల బతుకుల్లో కష్టాలు తెలియడం లేదని మండిపడ్డారు. ఈసమావేశాల్లో నాయకులు భవానీ చౌదరి, వెంకటేశ్వర్లు, జీవరత్నం, సీతారాములు, భారతి, రాంబాబు, ఉపేందర్, సైదాబీ, హన్మంతరావు, మందా అశోక్, తాళ్లూరి ప్రకాశ్, అంతోటి లక్ష్మి, వినోద్, వెంకటరత్నం, చిలకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన జరిగే మహాగర్జన సభకు మద్దతు తెలుపుతూ బీజేపీ నాయకులు మంద కృష్ణను కల్లూరులో కలిశారు. బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు తుమ్మలపూడి పుల్లారావు, సుబ్బారావు, వెంకటరెడ్డి, భీమరాజు, దొడ్డపనేని వెంకటేశ్వరరావు,, కృష్ణ, చాట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పెన్షన్ విద్రోహదినం



మాట్లాడుతున్న గుంటుపల్లి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: వచ్చేనెల 1న(సోమవారం) పెన్షన్ విద్రోహ దినంగా పాటించనున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలో టీఎన్జీవోస్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపుతో సోమవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలు, నల్ల దుస్తులతో నిరసన తెలపాలని నిర్ణయించారన్నారు. అలాగే, సెప్టెంబర్ 18న ఉమ్మడి జిల్లాలో జరిగే బస్సు యాత్ర, అక్టోబర్ 12న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. అనంతరం ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు ప్రకాష్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కొణిదన శ్రీనివాస్‌తో పాటు జడ్‌ఎస్.జైపాల్, విజయ్‌కుమార్, గంగవరపు బాలకృష్ణ, దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

7న రామాలయ ద్వారాలు మూత

భద్రాచలంటౌన్: చంద్రగ్రహణం సందర్భంగా సెప్టెంబర్ 7న మధ్యాహ్నం వరకే సీతారామచంద్ర స్వామివారి దర్శనం ఉంటుందని ఈఓ దామోదర్ రావు తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ ద్వారాలు మూసి సోమవారం తెల్లవారుజామున 3గంటలకు తెరుస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల తర్వాత ఉదయం 7.30గంటలకు దర్శనాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

క్లుప్తంగా

కేరళ నిట్ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మహితేజ

కూసుమంచి: మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన తాళ్లూరి మహితేజ కేరళ (కాలికట్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ ఇవిస్' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మ గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగామహితేజను గ్రామస్తులు అభినందించారు.

మారథాన్‌లో పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్


రాజును అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: హిమాచల్‌ప్రదేశ్‌లోని చైనా–టిబెట్ సరిహద్దు సమీపాన జరిగిన 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజు పతకం సాధించారు. ఆయనను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం అభినందించారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులకు సీపీ సునీల్‌దత్ శనివారం తన కార్యాలయంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఎస్‌ఐలు ఇబ్రహీం, వెంకన్న, ఏఎస్‌ఐలు వెంకటరెడ్డి, ఏఆర్ ఎస్సైలు సంగయ్య, శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుల్ మాధవరెడ్డి ఉండగా, ఈ కార్యక్రమంలో ఏసీపీలు మహేష్, సుశీల్‌సింగ్, ఆర్‌ఐలు కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీబీసీడీఓకు ఎస్సీ డీడీ బాధ్యతలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆ బాధ్యతలను డీబీసీడీఓ జి.జ్యోతికి అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈమేరకు సోమవారం జి.జ్యోతి ఎస్సీ డీడీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

2న జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి మహిళల వెయిల్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.వినోద్‌కుమార్ తెలిపారు. అస్మిత ఖేలో ఇండియా పోటీల్లో భాగంగా ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మంలోని 'వీ' జిమ్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులతో రావాలని, వివరాలకు 98480 62671 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.18,052

ఇకపై నిరంతరం కొనుగోళ్లు

- మధిర మార్కెట్ అప్‌గ్రేడ్‌కు సన్నాహాలు
- ఏటా ఆదాయం, కొనుగోళ్లు పెరుగుతుండడంతో నిర్ణయం
- రైతుల సౌకర్యం కోసం 'రెగ్యులర్ మార్కెట్'


మధిర వ్యవసాయ మార్కెట్ కార్యాలయం


మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

సంవత్సరం	ఆదాయం (రూ.లక్షల్లో)
2021-22	320.75
2022-23	428.54
2023-24	455.03
2024-25	484.20

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీని అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఏటా ఆదాయం పెరుగుతుండడం.. పెద్ద సంఖ్యలో రైతులు పంట ఉత్పత్తులను తీసుకొస్తుండడంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టి సారించారు. ఆయన సూచనలతో ఇటీవల మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జేడీ వి.శ్రీనివాస్ మార్కెట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం సీజన్‌లో మాత్రమే ఇక్కడ మిర్చి కొనుగోలు చేస్తున్నారు. మిగతా సమయాన రైతులకు నగదు అవసరమై కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన పంటను విక్రయించాలనుకుంటే ఖమ్మం వెళ్లక తప్పడం లేదు. దీంతో రెగ్యులర్ మార్కెట్‌గా అప్‌గ్రేడ్ చేస్తే ఏడాది పొడవునా అన్ని రకాల పంటల కొనుగోలుకు అవకాశం ఏర్పడుతుంది. అంతేకాక వ్యాపారుల నడుమ పోటీ పెరిగి మధిర ప్రాంతం, సరిహద్దు ఏపీలోని రైతులకు మద్దతు ధర లభించడమే కాక ఖమ్మం వెళ్లాల్సిన ఇబ్బందులు తీరతాయి.

1979లో ప్రారంభం

మధిరలో వ్యవసాయ మార్కెట్‌ను 1979 జనవరి 3న స్థాపించారు. ఈమధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల పరిధిలో విస్తరించి ఉండగా.. మధిరలో 18.24 ఎకరాల్లో మార్కెట్ ఉంది. అలాగే, ఎర్రుపాలెంలో సబ్ యార్డ్‌కు పది ఎకరాలు, బోనకల్ సబ్ యార్డుకు మూడు ఎకరాలతో పాటు చిరునోముల గోదాం ఐదెకరాల్లో ఉంది. ఇక నాబార్డుకు సంబంధించి రెండు గోదాంల్లో 10వేల మెట్రిక్ టన్నులు, ఇతర 12 గోదాంల్లో 16,350 మెట్రిక్ టన్నుల పంట నిల్వచేసే సామర్థ్యం ఉంది. మొత్తంగా 69 గ్రామాల పరిధి రైతులు ఇక్కడకు మిర్చి తీసుకొస్తారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ తరఫున రూ.8.93 కోట్ల నిధులు ఉండడం.. ప్రభుత్వం ఇంకొన్ని నిధులు మంజూరు చేస్తే అన్ని వసతులు కల్పించి నిరంతరం కొనుగోళ్లకు మార్గం ఏర్పడుతుంది. ఇక మార్కెట్‌ను అప్‌గ్రేడ్ చేస్తే కమీషన్ ఏజెంట్లకు లైసెన్సులు మంజూరు చేస్తారు. అలాగే, దడవాయి(వేమెన్)లను నియమిస్తారు. తద్వారా రైతుల ఇబ్బందులు తీరి, మార్కెట్‌కు ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.

చెక్‌పోస్టులు

మార్కెట్ పరిధిలో ఆత్కూరు, ఎర్రుపాలెం, రాజుపాలెంలో జిల్లా సరిహద్దు పోస్టులు, బోనకల్ వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు ఉంది. అలాగే, మధిరలో పరిశీలన కేంద్రం ఉంది. ఈ చెక్‌పోస్ట్‌ల మీదుగా ధాన్యం, పత్తి, సుబాబుల్, మిర్చి పంట లను తరలించే వాహనాల ద్వారా ఫీజు సమకూరుతోంది. 2025–26 వార్షిక సంవత్సరానికి రూ.499.50 లక్షల ఆదాయాన్ని నిర్దేశించగా జూలై 31వరకు రూ.122.13 లక్షల ఆదాయం సమకూరింది.

పోస్టులు ఖాళీ..

మధిర మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ హోదాతో కొనసాగుతుండగా ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు 12 మందికి ముగ్గురే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక గ్రేడ్–3 సెక్రటరీ, టైపిస్ట్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, అటెండర్ పోస్టు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉండగా, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ పోస్టులు రెండు, వాచ్‌మెన్ పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి.

మార్కెట్ అభివృద్ధికి కృషి


డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహకారంతో మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. మార్కెట్‌ను రెగ్యులర్ చేసి అన్ని రకాల పంటలను నిత్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటాం. తద్వారా రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది.

– బందారు నరసింహారావు, మార్కెట్ చైర్మన్

ఆదాయం పెరుగుతుంది..


మార్కెట్‌ను రెగ్యులర్ చేసి అన్ని పంటలు కొనుగోలు చేస్తే ఆదాయం పెరుగుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రెగ్యులర్ చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల ఉన్నతాధికారులు కూడా పరిశీలించారు.

– కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ గ్రేడ్–1 సెక్రటరీ

అన్ని వర్గాలకూ మంచిది


మార్కెట్ అభివృద్ధితో అన్ని వర్గాలకు బాగుంటుంది. పంట ఉత్పత్తులు తీసుకొచ్చే రైతులతో పాటు వ్యాపారులు, క్రయవిక్రయాలపై ఆధారపడి జీవించే వారికి ఆదాయం పెరుగుతుంది. మార్కెట్ కూడా నిత్యం కళకళలాడుతుంది.

– తల్లపురెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మిర్చి ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నూతనోత్సాహంతో విధులు నిర్వర్తించండి

సెర్ప్ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్‌లో అదనపు కలెక్టర్ శ్రీజ


బదిలీ కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: కొత్త స్థానాల్లో నూతన ఉత్సాహంతో పనిచేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. ఖమ్మం టీటీడీసీ భవనంలో శనివారం సెర్ప్ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సెర్ప్ సీఈఓ, కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో సెర్ప్ ఉద్యోగుల బదిలీలు విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 148 మంది ఉద్యోగులను కోరుకున్న స్థానాలకు ప్రాధాన్యతా ప్రకారం బదిలీ చేసినట్లు చెప్పారు. ఆయా ఉద్యోగులు కొత్త స్థానాల్లో ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఏపీడీ జయశ్రీతో పాటు డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఆపార్, ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ఖమ్మం సహకారనగర్: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేయటంతో పాటు ఆపార్ నంబర్ సైతం కేటాయించాలని అదనపు కలెక్టర్, డీఈఓ పి.శ్రీజ సూచించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్‌లో సందేహాలు ఉంటే తల్లిదండ్రులతో చర్చించి సెప్టెంబర్ 6వ తేదీ నాటికి పూర్తిచేయాలని తెలిపారు. డీఈఓ కార్యాలయ ఉద్యోగులు చావా శ్రీనివాసరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి..

ముదిగొండ: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని గొప్ప స్థాయికి ఎదిగిన వారిని ప్రేరణగా తీసుకుంటూ ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు ఉండడమే కాక నాణ్యమైన బోధన అందుతోందని తెలిపారు. చదువుకు పేదరికం అడ్డురాదని, గురువుల ప్రోత్సాహంతో ఆటంకాలను అధిగమిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చని చెప్పారు. ఐఆర్‌ఎస్ డిప్యూటీ కమిషనర్ జి.రవికిరణ్, రైల్వే అకౌంట్స్ విభాగం అధికారి టి.మనోజ్‌కుమార్, డీఐఈఓ కె.రవిబాబు, ఎన్‌ఆర్‌ఐ ట్రస్టు చైర్మన్ బాబురావుతో పాటు రాయల వెంకటేశ్వరరావు, మంకెన దామోదర్, ఇసుకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు ఇవ్వడం లేదు..

లారీ యజమానుల యూనియన్ ఆరోపణ


మాట్లాడుతున్న యూనియన్ ప్రతినిధులు

సత్తుపల్లి: ప్రతీరోజు 1,500 టన్నుల బొగ్గు లోడింగ్‌కు ఇస్తామని చెప్పి ఆచరణలో మాత్రం వెయ్యి టన్నులు కూడా ఇవ్వడం లేదని సత్తుపల్లి లారీ యజమానుల యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి రమేష్‌రెడ్డి, కోశాధికారి ఎస్.కే.మౌలాలీ ఆరోపించారు. సత్తుపల్లిలో శనివారం వారు మాట్లాడుతూ ఓసీల నుంచి రోజుకు 55వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుండగా, 30శాతం స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వాల్సిన బాధ్యత సింగరేణిపై ఉందన్నారు. కానీ ఐదు శాతం కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. అంతేకాక నా ణ్యమైన బొగ్గును స్థానిక లారీలకు లోడింగ్‌కు ఇస్తామని చెప్పి విస్మరించడంతో నాణ్యత లేని బొగ్గు తీసుకోవడానికి ట్రాన్స్‌పోర్టర్లు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. అన్నిరకాల బొగ్గు కలగలిపి అమ్మడంతో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని తెలిపారు. గతంలో పాల్వంచ నవభారత్ ప్లాంట్‌కు సత్తుపల్లి నుంచే బొగ్గు సరఫరా జరిగినా, ఇప్పుడు నాణ్యత లేకపోవడంతో మహారాష్ట్ర, ఒడిశా నుంచి తెప్పించుకుంటున్నారన్నారు. లారీ యజమానుల ఇబ్బందులను సింగరేణి యాజమాన్యం గుర్తించి ఇకనైనా నాణ్యమైన బొగ్గు, సరిపడా లోడింగ్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిన్నంశెట్టి సూరిబాబు, ఎస్‌కే.మునీర్, మన్మథరెడ్డి, సర్వేశ్వరరావు, దాసు పాల్గొన్నారు.

సెమీస్ దశకు బ్యాడ్మింటన్ టోర్నీ

నేడు ముగియనున్న రాష్ట్ర స్థాయి పోటీలు


అస్మారుహికి నగదు అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–15 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నీ శనివారం సెమీఫైనల్ దశకు చేరింది. బాలుర సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీచేతన్ శౌర్య(వరంగల్), చిన్మయి వాంక్‌డే(రంగారెడ్డి), చరణ్ హితేష్ విరాట్(సంగారెడ్డి), వి.చరణ్(మేడ్చల్), బాలికల సింగిల్స్‌లో అనన్య(మేడ్చల్), శృతియోచిత(సంగారెడ్డి), విక్రమ్‌గోరిత్(రంగారెడ్డి), మయా అగర్వాల్(హైదరాబాద్) ప్రతిభ చాటారు. బాలుర డబు ల్స్‌లో శివసంజీవ్(హైదరాబాద్) – నిఖిల్‌వర్మ(సంగారెడ్డి), సీహెచ్.విజిత్‌రెడ్డి – రవికిషోర్(రంగారెడ్డి), చిన్మయి వాంక్‌డే(రంగారెడ్డి) – క్రిష్(మేడ్చల్), చరణ్(మేడ్చల్) – శ్రీచేతన్, బాలికల విభాగంలో దొడ్డ దీప్తి – వి.నిత్య(రంగారెడ్డి), శ్రీవైభవి(నిజామాబాద్) – అనన్య(మేడ్చల్), అక్షర(హైదరాబాద్) – తౌషిక(మేడ్చ ల్), కందలిక – స్వాతికరెడ్డి(మేడ్చల్) సెమీస్ లోకి ప్రవేశించారు. ఇంకా మిక్స్‌డ్ డబుల్స్‌లో చరణ్ – తౌషిక, అక్షితరెడ్డి – శ్రీవైభవ్, రవికిషోర్ – కందలిక, కృష్ణా – శృతి సెమీఫైనల్స్‌కు చేరారు. ఆదివా రం సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహిస్తామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

జాతీయ పారా బ్యాడ్మింటన్ టోర్నీకి అస్మారుహి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో సెప్టెంబర్ 8నుంచి జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ పారా బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి అస్మారుహి ఎంపికైంది. ఆమెను బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు శనివారం సన్మానించి అస్మారుహికి రూ. 10వేల నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఎస్పీ జి.వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వీరభద్రం, వి.చంద్రశేఖర్‌తో పాటు సిరిపురపు సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలడంతో కూలీ మృతి

ముదిగొండ: నిర్మాణ పనుల్లో ఉన్న ఓ కూలీపై గోడ కూలడంతో మృతి చెందిన సంఘటన ముదిగొండ మండలం మేడేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. మేడేపల్లి చెందిన శివరాత్రి బీముడు అలియాస్ లక్ష్మయ్య(62) పనికి వెళ్లగా గోడ కూలి మీద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే, ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైద్య సేవలపై కమిషనర్ సమీక్ష


సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్యసేవలు, ఆన్‌లైన్ నివేదికలపై వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్, ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ సంగీత సత్యనారాయణ సమీక్షించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు సమీక్షించి వైద్య సేవలు, ఆన్‌లైన్‌లో నమోదు, రిజిస్టర్ల నిర్వహణపై సూచనలు చేశారు. ప్రతీ అంశంలో కచ్చితత్వం కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ వీసీకి జిల్లా నుంచి డీఎంహెచ్‌ఓ కళావతి బాయి, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు డాక్టర్ వరికూటి సుబ్బారావు, డాక్టర్ చందునాయక్, డాక్టర్ రామారావు, సుబ్రహ్మణ్యం, శేషపద్మ, నవీన్‌కుమార్, నాగరాజు, అన్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చిన మతిస్థిమితం లేని యువతి

కొన్నాళ్లుగా 'అన్నం'ఆశ్రమంలో ఆశ్రయం

ఖమ్మంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామానికి చెందిన మానసిక స్థితి సరిగా లేని ఆదివాసీ యువతి మహాలక్ష్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. పాడుబడిన గుడిసెలో నివసించే ఆమెకు తండ్రి బాలరాజు తప్ప తల్లి, తోబుట్టువులు ఎవరూ లేకపోగా కొద్దినెలల క్రితం గర్భం దాల్చినట్లు బయటపడింది. ఆమె సంరక్షణ ఎవరూ చూసుకునే పరి స్థితి లేకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం అధికారులు ఆశ్రయం కల్పించేందుకు ప్రయత్నించినా ఫలితం కానరాలేదు. చివరకు ఈనెల 1వ తేదీన ఖమ్మంకు చెందిన అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు అంబులెన్స్‌లో మహాలక్ష్మి, ఆమె తండ్రిని తీసుకొచ్చి ఖమ్మంలోని తమ ఆశ్రమంలో వసతి కల్పించారు. అక్కడ పౌష్టికాహారం అందిస్తూ వైద్యం చేయించడమే కాక ఇటీవల సీమంతం కూడా నిర్వహించారు. శనివారం ఉదయం మహాలక్ష్మికి పురిటినొప్పులు రావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా సాధారణ ప్రసవం ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీశిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

6న సామూహిక గణపతి నిమజ్జనం


పూజలు చేస్తున్న సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలో గణపతి నిమజ్జనాన్ని 6వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్లు స్తంభాద్రి ఉత్సవ సమితి, పురోహిత, అర్చక సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డితో పాటు గెంటేల విద్యాసాగర్, అల్లిక అంజయ్య, స్వీపర్ కన్నం ప్రసన్నకృష్ణ, మూలగుండ్ల శ్రీహరి, పురోహిత సంఘం అధ్యక్షుడు మారుతి వీరభద్ర ప్రసాద్, అర్చక సంఘం ప్రతినిధులు ఆమంచి సురేష్ శర్మ, తాటికొండ సీతారామశాస్త్రి తదితరులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గణపతి నిమజ్జనాన్ని 6వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం ఉత్సవకమిటీ ప్రతినిధులు నగరంలోని పలు గణపతి మండపాలను పరిశీలించి నిమజ్జనంలో జాగ్రత్తలపై సూచనలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అధికారులు, అధ్యాపకులు

బోనకల్: పర్యావరణ పరిరక్షణను ప్రతీఒక్కరు బాధ్యతగా భావించాలని డిస్ట్రిక్ట్ హెల్త్ ప్రోగ్రాం అధికారి కరుణాకర్ తెలిపారు. బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మొక్కలు నాటగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇంకొందరికి వివరించాలని సూచించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జోనతాబాబు, ఎస్‌ఎస్‌ఎస్ పీఓ అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు మోహన్, రాజేందర్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఓగా శైలేంద్ర

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో అకడమిక్ కోఆర్డినేటర్(ఏఎంఓ)గా శైలేంద్ర నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ముదిగొండ మండలం చింతకాని చిర్రుమర్రి హైస్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు శైలేంద్ర నియామకంపై శనివారం ఉత్తర్వులు జారీ చేయగా, ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

మనస్తాపంతో బలవన్మరణం


గోరుపాషా (ఫైల్)

కారేపల్లి: గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వైరా మండలం కారేపల్లి క్రాస్ రోడ్డు(రామలింగాపురం) గ్రామానికి చెందిన షేక్ గోరుపాషా అలియాస్ నానీ(30)కి తల్లాడ మండలం కలకొడిమ వాసి అనూషతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. కొంతకాలం క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అనూష పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన నానీ శుక్రవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తండ్రి జానీమియా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.గోపి తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

నర్సంపేట రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ జిల్లా నర్సంపేటలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన బెజవాడ సోమశేఖర్ (37)కు వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామానికి చెందిన అశ్వినితో ఆరేళ్ల క్రితం వివాహం జరగగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమశేఖర్ హనుమకొండలో ప్రైవేట్ ఉద్యోగం, అశ్విని ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని కేజీబీవీలో కాంట్రాక్ట్ పద్ధతిలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవల సోమశేఖర్ మద్యానికి బానిస కావడంతో గొడవలు జరుగుతుండగా గురువారం రాత్రి కూడా ఘర్షణ పడినట్లు తెలిసింది. ఈక్రమాన పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లాక అశ్విని శుక్రవారం ఉదయం విధులకు వెళ్లి హాస్టల్‌లో నైట్ డ్యూటీ ఉండడంతో అక్కడే ఉంది. శనివారం ఉదయం ఇంటి ఆవరణలో లైట్ వెలిగి ఉండడంతో స్థానికులు చూడగా సోమశేఖర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.3లక్షల విలువైన టపాసులు స్వాధీనం

ఖమ్మంక్రైం: అనుమతి లేకుండా తరలిస్తున్న టపాసులను శనివారం రాత్రి ఖమ్మం త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఓ కార్యక్రమం కోసం బాలకృష్ణ అనే వ్యక్తి ఖమ్మం గాంధీచౌక్‌లో రూ.3లక్షల విలువైన టపాసులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడు. ఈక్రమాన సీఐ మోహన్‌బాబు ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో పట్టుబడగా ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.